క్లుప్తంగా

క్యాన్సర్ రోగికి విద్యార్థుల ఆర్థిక సాయం



పెనమలూరు: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న రోగికి పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తమ వంతు ఆర్థిక సాయం అందజేశారు. కాలేజీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు వివరాలు తెలుపుతూ ఐటీ డిపార్టుమెంట్‌లో ఫైనలియర్ చదువుతున్న విద్యార్థిని తండ్రి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండటంతో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సాయం చేయటానికి ముందుకు వచ్చారన్నారు. ఈ మేరకు రూ.44,700 అందజేశారని తెలిపారు. విద్యార్థులు సమాజసేవ చేయటానికి ముందుకు రావటంపై అభినందించారు. కార్యక్రమంలో ఐటీ విభాగాధిపతి బీవీ సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్యామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి




గన్నవరం: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కోడే ప్రభావతిదేవి సూచించారు. మండల స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో గన్నవరం శివారులో బుధవారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా దాదతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ ప్రభావతిదేవి మాట్లాడుతూ.. సర్వైకల్ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా సకాలంలో వైద్య సేవలందించవచ్చని తెలిపారు. సర్వికల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేయించాలని సూచించారు. మహిళల ఆరోగ్య సంరక్షణకు దాదతి ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఎంపీడీఓ టి.స్వర్ణలత, జీఎస్‌వీ గ్రూపు చైర్మన్ గొట్టిముక్కల కల్యాణి, అమల్‌కిరణ్, నరేష్‌కుమార్, పవన్‌కుమార్, డ్వాక్రా మహిళా సంఘం అధ్యక్షురాలు నీరజ తదితరులు పాల్గొన్నారు.

350 భోజనం ప్లేట్ల పంపిణీ



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం కొండేటి డిజిటల్ స్టూడియో ఆధ్వర్యంలో 350 మంది విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డించేందుకు అవసరమైన ప్లేట్లు కోరగా కొండేటి అన్నపూర్ణమ్మ జ్ఞాపకార్థం వీటిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం నీలా కమలాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్లేట్లు అవసరమని కోరిన వెంటనే దాతలు స్పందించి అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు, విద్యా కమిటీ చైర్మన్ కొత్తపల్లి విజయ్, కొండేటి శ్రీనివాసరావు, కొండేటి కొండలరావు, కార్యదర్శి కోటి లింగమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు



కంఠమనేని నాగేశ్వరరావు(ఫైల్)

ఉయ్యూరు: మండలంలోని కాటూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చనిపోయి నేత్రదానం ద్వారా ఇద్దరికి చూపును అందించాడు. గ్రామానికి చెందిన కంఠమనేని నాగేశ్వరరావు(82) అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. తన మరణానంతరం రెండు కళ్లను దానమివ్వాలని కుటుంబ సభ్యులను కోరారు. దీంతో నాగేశ్వరరావు నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానమిచ్చారు. కంఠమనేని నేత్రదానంతో ఇద్దరికి చూపు వస్తుందని వైద్యులు తెలిపారు. కంఠమనేని కుటుంబ సభ్యులను అభినందించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతికి సంతాపం



పెనమలూరు: పెనమలూరులో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, దాత, వ్యాపారవేత్త గుండా మల్లిఖార్జునప్రసాద్(50) అనారోగ్యం కారణంగా మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి బుధవారం మృతుడి స్వగృహానికి వెళ్లి ఘన నివాళులర్పించారు. ఆయన పవిత్రాత్మకు శాంతికలగాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అపరాల విత్తనాలు ఏవీ?

- విత్తనాల కోసం రైతుల ఎదురుచూపు
- కోతలకు ముందే అందాల్సిన విత్తనాలు
- నేటికీ అందని దుస్థితి
- బయటి మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న రైతులు



కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలం

కంకిపాడు: ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు ధాన్యాన్ని మిల్లులకు తరలించే పనిలో ఉన్నారు. మరో వైపు అపరాల విత్తనాలు కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. అదును పోతుండటంతో బయటి మార్కెట్‌లో కొనుగోలు చేసి రెండో పంట పనులు కూడా చేపడుతున్నారు. రైతుల అవసరాలను గుర్తించి పరిష్కరించటంలో కూటమి సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరించటం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రెండో పంటగా రబీ సీజన్‌లో 1.10 లక్షల హెక్టార్లలో మినుము, 4200 హెక్టార్లలో పెసర పంట సాగు చేస్తుంటారు. ఈ ఏడాది కూడా గత సాగు విస్తీర్ణానికి తగ్గకుండా సాగు జరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

రైతుల చెంతకు చేరని విత్తనాలు

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ వరి కోతలు సాగుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలింది. రెండో పంటగా అపరాల సాగు చేపట్టేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నారు. వరి పంట కోత కోసే సమయంలోనూ, కోత అవ్వగానే మినుము, పెసర విత్తనాలు చల్లుతారు. అప్పుడే అదునుకు విత్తనం భూమిలో పడటంతో మొలక శాతం ఆశాజనకంగా ఉంటుంది. కానీ ఇప్పటి వరకూ జిల్లాలో అపరాల విత్తనాలు పంపిణీ చేపట్టిన దాఖలాలు లేవు. రైతు సేవా కేంద్రాల వారీగా విత్తనాలను 10 రోజుల క్రితమే సరఫరా చేశారు. అయితే అవి నేటికీ రైతుల చెంతకు చేరలేదు. విత్తనాలు ఎప్పుడు పంపిణీ చేస్తారా? అని రైతాంగం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

సరఫరా అరకొరే..

జిల్లా వ్యాప్తంగా అపరాల సాగుకు గానూ అధికారులు ప్రాథమికంగా మండలాల వారీగా అంచనాలను రూపొందించి ఏపీ సీడ్స్‌కు ఇండెంట్ పెట్టారు. ఇందులో పెసలు(విరాట్) 268 క్వింటాళ్లు, మినుము పీయూ 31 రకం 276 క్వింటాళ్లు, ఎల్‌బీజీ 752 రకం 1946 క్వింటాళ్లు, వీబీఎన్-8 రకం 1401 క్వింటాళ్లు కావాలని ఇండెంట్ ఇచ్చారు. అయితే అధికారికంగా ఏపీ సీడ్స్ నుంచి వ్యవసాయశాఖ ద్వారా మినుములో ఎల్‌బీజీ 752 రకం 200 క్వింటాళ్లు, పీయూ 31 రకం 50 క్వింటాళ్లు, పెసలు విరాట్ రకం 75 క్వింటాళ్లు మాత్రమే అందుబాటులో ఉంచారు. అయితే విడతల వారీగా రైతుల డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు.

అన్నదాతల్లో ఆందోళన

సీజన్‌కు అవసరమైన విత్తనాలను సరఫరా చేసేలా పాలకులు చర్యలు తీసుకోవాలి. కానీ కూటమి సర్కారు ఆ దిశగా చర్యలు తీసుకోలేదంటూ అన్నదాతలు విమర్శిస్తున్నారు. కోతల దశకు చేరుకోగానే మినుము, పెసలు విత్తనాలు అందకపోవటంతో పంట పొలాలు అదును పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో రైతులు బయటి మార్కెట్‌లో కిలో రూ.100 చొప్పున క్వింటా రూ.9,500 - రూ.10 వేలు చొప్పున ధర పెట్టి కొనుగోళ్లు చేసి పొలాల్లో విత్తులు చల్లుతున్నారు. పొలాలు అదును పోతే ఆ ప్రభావం మొలక శాతం, దిగుబడిపైనా కూడా పడుతుందని, చేసేది లేక బయటి మార్కెట్‌పై ఆధారపడాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. అయితే బయటి మార్కెట్‌లో నకిలీ విత్తనాల మాయలో పడే ప్రమాదం ఉండటంతో అన్నదాతల్లో ఆందోళన పెరుగుతోంది.

సబ్సిడీ విత్తనాలు అందలేదు



మూడున్నర ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. కోతకు సిద్ధంగా ఉంది. అపరాల కోసం చూశాను. సబ్సిడీ విత్తనాలు వస్తాయేమో అని. కానీ వచ్చే పరిస్థితి లేదని తెలిసి బయటి మార్కెట్‌లో కొని పొలంలో చల్లాను. సీజన్‌కు ముందే విత్తనాలు సమకూర్చి ఉంటే బయటి మార్కెట్‌కి వెళ్లాల్సిన అవసరం వచ్చేది కాదు.

– జింపన శ్యాం, కౌలురైతు, పునాదిపాడు

ఇండెంట్ ప్రకారం సరఫరా..

ఇండెంట్ ప్రకారం రైతులకు రెండో పంటకు అవసరమైన అపరాల విత్తనాలను అందిస్తున్నాం. తొలి విడత అందుబాటులో ఉంచాం. అయితే బయటి మార్కెట్‌లో కూడా ఒకే ధర పలుకుతుండటంతో రైతులు బయటి విత్తనాలను సేకరించి సాగు చేసుకుంటున్నారు. రైతులు కోరితే మాత్రం ఇండెంట్ ప్రకారం విత్తనాల సరఫరాకు చర్యలు తీసుకుంటాం.

– ఎన్.పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి

బకాయిలు చెల్లించాలని భవన నిర్మాణ కార్మికుల నిరసన



గన్నవరం: స్థానిక వీఎస్ పురం రోడ్డులోని అయోధ్య అపార్ట్‌మెంట్ వద్ద బుధవారం భవన నిర్మాణ కార్మికులు నిరసనకు దిగారు. తమకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కూలీలు ఆర్అండ్‌బీ రోడ్డుపై బైఠాయించారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు రంగంలోకి దిగి కార్మికులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా లేబర్ కాంట్రాక్టర్లు రామ్మోహన్‌రావు, సతీష్ మాట్లాడుతూ...అయోధ్య అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి 2018 నుంచి 2022 తాపీ కూలీలు పని చేశారని తెలిపారు. వీరికి చెల్లించాల్సిన బకాయిలు ఇవ్వకుండా యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి బకాయిలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా లక్ష దీపోత్సవం



కంకిపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి నిర్వహించిన లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. ఓంకారం, శివలింగాకృతి, దీపాలంకృతిలో దీపాలు వెలిగించారు. దీప కాంతుల్లో ఆలయం కార్తిక శోభ సంతరించుకుంది.

అంబాపురం సర్పంచ్‌పై డీఎల్‌పీఓ విచారణ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఫిర్యాదుపై బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఎల్‌పీఓ, ఈఓఆర్డీ ప్రసాద్ విచారణ చేపట్టారు. 11 అంశాల్లో గ్రామ సర్పంచ్ తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఉపసర్పంచ్ ఎస్.శ్యామల, వార్డు సభ్యులు తోడేటి కిరణ్‌కుమార్, అయిలా విజయ్ కుమార్, పలువురు గ్రామస్తులు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఉన్నతాధికారులు ఈఓఆర్డీ ప్రసాద్‌ను విచారణ చేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. దీంతో సర్పంచ్ గండికోట సీతయ్య పాలకవర్గ సభ్యుల సమక్షంలో ప్రశ్నించి ఈఓఆర్డీ స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అర్జీదారుల వద్ద నుంచి ఆధారాలు తీసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తానని ఈఓఆర్డీ తెలిపారు.

బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యం



దావాజిగూడెంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వాసవ్య ప్రతినిధులు



వణుకూరులో అవగాహన కల్పిస్తున్న పద్మలత

గన్నవరం: బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యమని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ నాగపద్మావతి పిలుపునిచ్చారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలుర, బాలికల, దావాజిగూడెం, కేసరపల్లి హైస్కూల్స్‌లో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ సోషల్ వర్కర్ డి.మార్తమ్మ నేతృత్వంలో విద్యార్థులచే బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడపిల్లలకు చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల రక్తహీనత వంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. అంతే కాకుండా గృహ హింసకు గురికావడంతో పాటు ప్రసూతి మరణాలు, శిశు మరణాలు అధిక శాతం సంభవిస్తున్నాయన్నారు. పురుషులకు 21, మహిళలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే ఐసీడీఎస్, చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బుద్దవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, పాఠశాల హెచ్ఎంలు వై.సునీత, పార్వతి, ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శులు జి.గీత, ఎం.శిరీష, లక్ష్మీకరుణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం దావాజిగూడెంలోని బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు వారు అవగాహన కల్పించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

పెనమలూరు: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు వస్తాయని, బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలని వణుకూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని బి.పద్మలత కోరారు. జాతీయ బాల్య వివాహాల వ్యతిరేక కార్యక్రమంలో భాగంగా వణుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత టీవీలో హిందీ ప్రత్యక్ష ప్రసారాన్ని హిందీ ఉపాధ్యాయుడు శివాజీ తెలుగులో విద్యార్థినులకు వివరించారు. అనంతరం పద్మలత మాట్లాడుతూ విద్యార్థినులు బాల్య వివాహాలపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. బలవంతంగా బాల్య వివాహాలు చేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.రఘురామ్, మహిళా సంరక్షణ కార్యదర్శి డి.వికల్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

సాంకేతిక మార్పులకు అనుగుణంగా చదవాలి



ప్రతిభ చూపిన విద్యార్థిని అభినందిస్తున్న వైస్ చాన్సలర్ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ

పెనమలూరు: విద్యార్థులు మారుతున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా చదవి రాణించాలని జేఎన్‌టీయుకే వైస్ చాన్సలర్ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం జాయ్ ఆఫ్ ఇంజినీరింగ్ అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు ఎదగాలంటే ప్రణాళిక ఉండాలన్నారు. నూతన సాంకేతిక మార్పులను గుర్తించాలని సూచించారు. డేటా సైన్స్, ఏఐ, మెషిన్ లెర్నింగ్, ఫుల్ స్టాక్ జావా, బ్లాక్ చైన్ వంటి అంశాలపై నైపుణ్యం పెంచుకోవాలని తెలిపారు. విద్యార్థులు భయం వీడి భాషా ప్రావీణ్యంపై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ ఎకడమిక్ డైరెక్టర్ దోనేపూడి రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన సమారాధన

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో కార్తికమాస ద్వాదశిని పురస్కరించుకుని శ్రీ వైఖానస యూత్ ఫోరం గన్నవరం శాఖ ఆధ్వర్యంలో బుధవారం వనసమారాధన నిర్వహించారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన బ్రాహ్మణులు కుటుంబ సమేతంగా కార్తిక వనసమారాధనకు తరలివచ్చారు. తొలుత ఆలయ ప్రాంగణంలో ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ భగవంతునికి పూజలు చేశారు. రోజంతా పూజా కార్యక్రమాలు, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. వైఖానస యూత్ ఫోరం రాష్ట్ర కార్యవర్గం, గన్నవరం శాఖ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

30న సామాజిక పింఛన్ల పంపిణీ

గన్నవరం: మండలంలోని పెన్షన్ లబ్ధిదారులకు డిసెంబర్ పింఛన్ నగదును ఈ నెల 30వ తేదీన పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ టి.స్వర్ణలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేస్తామన్నారు. లబ్ధిదారులు శనివారం ఇళ్ల వద్ద అందుబాటులో ఉండి పింఛన్ నగదు తీసుకోవాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇబ్బంది పెడితే సహించం

పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి



కంకిపాడులో కార్యకర్తలతో మాట్లాడుతున్న దేవభక్తుని చక్రవర్తి

కంకిపాడు: తమ పార్టీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. ఈడుపుగల్లు గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త బోరగుడి శ్రీకాంత్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిచి విచారణ పేరుతో ఇబ్బంది పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంకిపాడు సర్కిల్ కార్యాలయానికి పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం వచ్చారు. అధికారులతో మాట్లాడిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కూటమి నేతలు కక్ష తీర్చుకోవటానికి అధికారులను పావులుగా వాడుతున్నారని మండిపడ్డారు. కక్షపూరితంగా, అకారణంగా కార్యకర్తలను పోలీసుస్టేషన్‌లకు పిలిచి విచారించటం, భయభ్రాంతులకు గురి చేయటం సరికాదన్నారు. కార్యకర్తల జీవనోపాధులను దెబ్బతీసేలా అధికారుల చర్యలు ఉంటున్నాయన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యకర్తల జోలికొస్తే ఊరుకోబోమని, తగిన గుణపాఠం చెబుతామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, ఎంపీటీసీ చిట్టూరి ప్రసాద్, నాయకులు బిళ్లా వెంకటేశ్వరరావు, చుండూరు మోహన్‌రావు, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కౌంటర్ కేసుల నమోదు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో దళితుడిపై దాడి ఘటనపై పోలీసులు బుధవారం కౌంటర్ కేసులు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం వణుకూరుకు చెందిన తోడేటి సురేష్ ఈ నెల 7న భార్యతో ఇంటికి వస్తుండగా ఇసుక ట్రాక్టర్ అతి వేగంగా రావటంతో ట్రాక్టర్‌ను అడ్డుకున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు చోడవరం గ్రామానికి చెందిన మోదుకూరి నాని అతని అనుచరులు వచ్చి సురేష్‌ను కులం పేరుతో దూషించి కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా తొలుత కేసు నమోదు చేయలేదు. రెండు రోజుల క్రితం దళితులు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేయగా ఎట్టకేలకు పోలీసులు దాడి చేసిన వ్యక్తులపై దాడి, కులదూషణ కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్ డ్రైవర్ ఫిర్యాదుతో..

కాగా చోడవరం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ శీలం చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ట్రాక్టర్ ఇసుక లోడ్‌తో వణుకూరు మీదుగా కంకిపాడుకు వెళుతుండగా ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి ట్రాక్టర్‌ను ఆపారని తెలిపాడు. తనను దూషించి తనపై దాడి చేశారని ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

హైకోర్టు తీర్పుపై విశ్రాంత ఉద్యోగుల సంఘం హర్షం

గన్నవరం: విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ నుంచి కమ్యూటేషన్ భాగాన్ని రికవరీ చేయవద్దని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ఏపీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గన్నవరం తాలుకా యూనిట్ అధ్యక్షుడు ఆవుటపల్లి మోహన్‌రావు తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సేవాభవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులు పెన్షన్‌లో కొంత భాగాన్ని ప్రభుత్వానికి అమ్మి నగదు తీసుకుంటారన్నారు. ఈ నగదును ప్రభుత్వం 180 నెలల కాలానికి రికవరీ చేస్తోందని చెప్పారు. రికవరీ 11 ఏళ్ల మూడు నెలలకు సరిపోతుందని విశ్రాంత ఉద్యోగులు తరుపున ఠాగూర్ యాదవ్, టి.విజయసారథి బృందం హైకోర్టును ఆశ్రయించారన్నారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల పక్షాన నిలిచిన న్యాయవాదుల బృందానికి అభినందనలు తెలియజేశారు. సంఘ నాయకులు షేక్ వల్లిసాహెబ్, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తేమ శాతం ఉన్నా ధాన్యం కొనుగోలు చేస్తాం



గంగూరులో ధాన్యం రాసులు పరిశీలిస్తున్న ఏడీఏ సునీల్, ఏఓ శైలజ

పెనమలూరు: ధాన్యంలో తేమ శాతం ఉన్నా ధాన్యం కొనుగోలు చేస్తామని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.సునీల్ అన్నారు. ఆయన బుధవారం గంగూరు, యనమలకుదురు గ్రామాలలో కోసి ఆరబెట్టిన ధాన్యం పరిశీలించి వివరాలు తెలిపారు. ధాన్యంలో తేమ శాతం 25 వరకు ఉన్నా కొనుగోలు చేస్తామన్నారు. తేమ శాతం ఆధారంగా క్వింటాకు ఒక కేజీ చొప్పున మినహాయింపు చేస్తామని చెప్పారు. అయితే రైతులు సాధ్యమైనంత వరకు తేమ శాతం తక్కువగా ఉండే విధంగా చూడాలని సూచించారు. ధాన్యం రవాణాకు రైతు పీపీసీ సైట్‌లో నమోదు చేయించుకుంటే జీపీఎస్ లేకుండా ధాన్యం తరలించటానికి అవకాశం ఉంటుందన్నారు. మండలంలో ఇప్పటి వరకు 1,170 మెట్రిక్ టన్నుల ధాన్యం ఎఫ్‌టీవో ద్వారా తరలించామని తెలిపారు. రైతులకు గోనె సంచులు అందుబాటులో ఉంచామని, రవాణాకు కూడా ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, వీఏఏలు అహల్య, జమీలఅంజు, రైతులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే రైతులు ధాన్యం విక్రయించాలి

గన్నవరం: మండలంలోని బుద్దవరం, గన్నవరం గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి క్షేత్రాలను మండల వ్యవసాయాధికారి వై.రజని పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. ధాన్యం సాధరణ రకం(కామన్) వంద కేజీలు రూ.2,300, గ్రేడ్ ఏ రకం రూ.2,320 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. ధాన్యంలో తేమ శాతం 17 ఉండేలా చూసుకోవాలని సూచించారు. టార్పాలిన్స్, స్ప్రేయర్స్ రాయితీపై సరఫరా చేయాలని రైతులు కోరారు. పలువురు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సూరంపల్లిలో ఆర్ఎస్‌కే ద్వారా కొనుగోలు

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడుతూ తేమ శాతం 17లోగా ఉండాలని చెప్పారు. సాధారణ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,300, ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకం 75 కేజీలకు రూ.1,725, ఏ గ్రేడ్ రకానికి రూ.1,740 ప్రభుత్వ చెల్లిస్తోందన్నారు. లేబర్ చార్జీలు, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుందని, రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. రైతులు గుండపనేని రమేష్, కాసన్నేని రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ హెచ్చరికలతో వరి పంటను కోయవద్దు

హనుమాన్‌జంక్షన్ రూరల్: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెంది వరి పంటను కోయవద్దని మండల వ్యవసాయాధికారి జోన్నలగడ్డ భవాని చెప్పారు. జిల్లాలో తుఫాన్ ప్రభావం ఉండదని జాయింట్ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలలో పేర్కొన్నారన్నారు. బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలను బుధవారం ఆమె పరిశీలించారు. తుఫాన్ భయాందోళనతో ముందుగానే వరిపంటను కోయటం వల్ల ధాన్యంలో తేమశాతం అధికంగా ఉండే అవకాశం ఉందని, తద్వారా మద్దతు ధర లభించక రైతులు నష్టపోతారని చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యంలో తేమ 17 శాతానికి మించకూడదని ఏవో భవాని వివరించారు. కానీ ముందస్తుగా వరిపంట కోయటం వల్ల ధాన్యంలో తేమ 26 శాతం వరకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే వరికోతలు పూర్తి చేసిన రైతులు కుప్పలు వేసుకోవచ్చని, లేదా ధాన్యం తడవకుండా టార్పాలిన్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

ఘనంగా ఏరీస్ ఆగ్రో వ్యవస్థాపక దినోత్సవం

గన్నవరంరూరల్: రైతుల సేవలో ఏరీస్ ఆగ్రో 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి జయప్రదీప్ సుబ్రమణియన్ చెప్పారు. సూరంపల్లి ఏరీస్ కార్యాలయంలో వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలలో వచ్చే సమస్యలను అధ్యయనం చేసి, వాటికి నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతినిధులు ఎ.వెంకటేశ్వరరావు, అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ నాణ్యతా పునాదిగా ఏరీస్ కొనసాగుతుందన్నారు. వంద రోజుల డ్రోన్ యాత్రను సంస్థ చేపట్టిందని, రైతులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

ముమ్మరంగా పూడికతీత పనులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామంలోని అంతర్గత రహదారుల్లోని చెత్తను తొలగించడంతో పాటు సైడు డ్రెయిన్లలో బుధవారం పూడిక తీశారు. సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లు గుర్తించి మురుగు నీరు సజావుగా పారుదల అయ్యేందుకు పారిశుద్ధ్య సిబ్బందిచే చర్యలు తీసుకున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు పరచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతర్గత రహదారుల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని చెప్పారు.